


(17వ భాగము)

“ఆఁ” అంటూనే ఒక డింగీని, రెండు చేతుల్తో పట్టుకొని పైకెత్తి పట్టుకొన్నాను. ఇసుకలో బర బర ఈడ్చుకుంటూ నీళ్ళ దగ్గరకు లాక్కొచ్చాను. డెల్లా కూడా మా సంచులు మోసుకొని వచ్చేసింది.

సంచుల్ని డింగీలో పెట్టాం. ఇద్దరం డింగీని నీళ్ళలోకి త్రోసి, నడుం లోతుదాకా నీళ్ళల్లో నడుచుకుంటూ వెళ్ళాం. ఆ తర్వాత ముందామెను ఎక్కించి, తర్వాత నేను ఎక్కి కూర్చున్నాను.

డింగీ మెల్లగా ముందుకు కదిలింది.

చీకట్లో దారి చూసుకుంటూ, తెడ్డు వేస్తూ, అంతకు ముందు కొండ దగ్గరకు వెళ్ళిన త్రోవనే వెళ్ళసాగాను డింగీతో.

"రాజ్! మన ప్రయాణ మీ డింగీలోనేనా?" అడిగింది డెల్లా.

"దీంతో ఈ సముద్రంలో ప్రయాణం చెయ్యటం కష్టం. ముందా కొండ వద్దకు వెళ్దాం. ఆ తర్వాత ఆలోచిద్దాం" అన్నాను.

"ఏదైనా షిప్ వచ్చే అవకాశం వుందా?"

"తెలీదు. వస్తే అదృష్టవంతులమే!"

"పోనీ, ఆ కొండపైన వుండి రెండు దినాలు వెయిట్ చేద్దామా?" అడిగింది డెల్లా.

"వద్దు! ఆమె మన తుపాకీ గుండ్లనుండి తప్పించుకుని వెళ్ళింది. ఈపాటికి గూడెం చేరి వుంటుంది. నాయకుడికి మన పరారీ గురించి, ఆమెను మనం చంపబోయిన వైనం గురించీ చెప్పి వుంటుంది. మన కోసం వాళ్ళు వస్తారు. మనం కొండ దగ్గరే వుంటామని వాళ్ళు ఊహిస్తారు. అందువల్ల మనం ఎలాగైనా ఇంకా ముందుకు వెళ్ళిపోవాలి. ఈ రాత్రి, రేపు పగలూ సముద్రంలోనే గడపాలి" అన్నాను.

"సముద్రంలో తుఫానుగానీ, గాలివానగానీ, రాకుంటే ఈ డింగీలో ఎలాగోలా ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని కాలక్షేపం చెయ్యొచ్చు" అంది డెల్లా.

మా డింగీ కొండ ప్రాంతానికి వచ్చేసింది. రెండు కొండల మధ్య నుంచి ముందుకు కదలిపోయింది. అలాగే మెలుదూరం వెళ్ళిపోయాం. పెద్ద పెద్ద అలలతోపాటు వెడల్పాటి కెరటాలు కూడా మా డింగీని తల క్రిందులు చేసేందుకు ప్రయత్నించాయి.

బరువును మారుస్తూ, తెడ్లు జాగ్రత్తగా వేసుకుంటూ వాట్ని దాటాం. అవతలవేపు ప్రశాంతంగా వుంది.

జోరుగా సముద్రపు హోరు మాత్రం వినిపించసాగింది.

ఈ వాతావరణం మాకు క్రొత్తకాదు. అంతకు ముందు రెండు మూడుసార్లు ఇలాంటి పరిస్థితుల్లోనూ, వాతావరణం లోనూ చిక్కుకుని వున్న మాకు పెద్దగా భయంగానీ, ఆశ్చర్యంగానీ కలుగలేదు.

అప్పటికి మేము గూడెం నుండి తప్పుకొని వచ్చేసి నాలుగు గంటలకు పైనే అయివుండాలనిపించింది.

నేను తీరంకేసి చూడసాగాను.

"నిద్ర వస్తోంది కాసేపు పడుకొంటాను" అంది డెల్లా.

"పడుకో! సంచీపైన తల పెట్టుకొని కాళ్ళు డింగీ అంచు పైన, నీళ్ళలోకి జారేట్లుగా వుంచుకో" అని చెప్పాను.

ఆమె నేను చెప్పినట్లే చేసింది. డింగీ ఆమె కదలికలకు అటూ ఇటూ వూగింది. నా బరువు అవసరమైన పద్ధతిలోకి మార్చుకుంటూ, డింగీ తల్రక్రిందులుగాకుండా చూసుకు న్నాను.

డెల్లా హాయిగా పడుకుంది.

నేను సిగరెట్ వెలిగించాను. కొండపైన వెలుతురు కనిపించింది. కళ్ళు చిట్లించి చూశాను. బారులుగా మండు తున్న కాగడాలు కనిపించాయి. నాయకుడు అతని పటాలం వచ్చేశారని తెలుసుకున్నాను.

అక్కడ్నుంచి నేనుగానీ, డింగీ గానీ వాళ్ళకు కను పించే అవకాశం లేదు. వాళ్ళేం చేస్తారని ఆలోచించ సాగాను.

కాసేపు చుట్టూ చూసి వెళ్ళిపోతారు. అంతకన్నా మరేం చెయ్యగలరు? నన్ను నేను ప్రశ్నించుకున్నాను.

నాయకుడికి నాపైన వున్న ప్రేమ ఎంతో గుర్తొచ్చింది. అతన్ని మోసం చేశానని తెలియగానే అంతకు అంత ద్వేషం పుట్టి వుంటుంది. చిక్కితే చంపాలన్నంత కోపంతో వచ్చి వుంటుందనుకున్నాను.

నేను కొండ కేసి చూడసాగాను.

ఐదు నిముషాల తర్వాత, సముద్రంలో కాగడాలు అన్ని వేపులా వెళ్ళిపోతూ కనిపించాయి. అంటే తన జనాన్ని డింగీల్లోనే సాధ్యమైనంత దూరం వెళ్ళి వెతికి రమ్మని నాయకుడు పురమాయించి వుండాలి.

మేమున్న వేపు కూడా కొన్ని డింగీలు కదలి రావడం గమనించాను. నేను క్షణాలలో ఒక నిశ్చయానికొచ్చాను.

సిగరెట్ తాగుతూనే డింగీల వైపు తదేకంగా చూడసాగాను. డెల్లా మంచి నిద్రలో వుంది.

నా వైపు వస్తున్న కాగడాల్ని లెక్క పెట్టాను. మొత్తం ఆరున్నాయి. అంటే ఆరుమందన్నా, లేక పన్నెండు మందన్నా వుండి వుండాలి. దగ్గరకొస్తేగానీ ఖచ్చితంగా తెలియదు. అంతకంతకూ అవి దగ్గరవుతున్నాయి.

డెల్లాను లేపాను చేత్తో మెల్లగా తొడపైన తట్టి.

ఉలిక్కిపడి లేచి "ఏమిటి?" అంది.

"వాళ్ళొస్తున్నారు!" అన్నాను.

"ఎవరు?" అంది నిద్రమత్తులో అర్థంగానట్టు.

"వాళ్ళే! మన గూడెంవాళ్ళు. దగ్గర కొచ్చేస్తున్నారు" అన్నాను.

"ఏం చేద్దాం?" అడిగింది లేచి కూర్చుని గాభరాగా.

"చేతులు ముడుచుకొని కూర్చుంటే లాక్కుపోతారు. మన దగ్గర తుపాకులున్నాయి. కాల్చిపారేద్దాం" అన్నాను.

"సరే!" అంటూ తన తుపాకీ చేతికి తీసుకుంది డెల్లా.

నేను కూడా తుపాకీని సరిచేసి పెట్టుకున్నాను.

వాళ్ళను కాల్చేముందు, మా డింగీని ఏ పరిస్థితుల్లోనూ వాళ్ళమధ్య వుండేట్లుగా చెయ్యకూడదని తీర్మానించుకున్నాను.

డింగీలు దగ్గరయినాయి. వందగజాల దూరంలో వుండి వుంటాయనుకున్నాను. అవి యీ కొండ దగ్గరకు వస్తే గాని కాల్చి ప్రయోజనం లేదు.

సముద్రపు హోరును మించి వినిపించాయి వాళ్ళ హాహాకారాలు.

మమ్మల్ని వాళ్ళు చూచినట్లున్నారని పసిగట్టాను. ఆ సంతోషంలోనే వాళ్ళలా అరుస్తున్నారని అర్థం చేసుకున్నాను.

డింగీలు బాగా దగ్గర కొచ్చాయి. మొత్తం ఆరున్నాయి. అంటే పన్నెండు మంది దాకా వచ్చారు మా వేపు.

"దగ్గరకు రావద్దు. మావద్ద తుపాకులున్నాయి. మొండిగా వచ్చారంటే కాల్చి పారేస్తాను." వాళ్ళ భాషలోనే హెచ్చరిస్తూ అరిచాను.

"మిమ్మల్ని పట్టుకుపోయేందుకు వచ్చాం. కాల్చినాసరే మా ప్రయత్నం మానము. మా నాయకుడి ఆజ్ఞ" అన్నారు వాళ్ళు ముక్తకంఠంతో.

"అయితే మీ ఖర్మ!" అంటూ మొదటి రౌండు గురి పెట్టి కాల్చాను. డెల్లా కూడా ఫస్ట్ రౌండు ఫైర్ చేసింది.

"అమ్మో!" అన్న అరుపులు చీకటిని పెగుల్చుకుని హృదయవిదారకంగా వినిపించాయి.

(ఇంకావుంది)